క్లుప్తంగా

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



అరట్లకట్టలో ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరప: ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లు ఎలా పనిచేస్తాయో ఓటర్లందరూ అవగాహన కల్పించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అరట్లకట్టగ్రామంలో బుధవారం ఓటర్లతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జి.శ్యామ్‌ప్రసాద్, టీఆర్ఎస్ ప్రసాద్‌లతో కలసి డీటీ అనిల్ కుమార్ ఓటర్లకు ఈవీఎంల గురించి, అవి ఎలా పనిచేస్తాయో, దానిపై ఎలా ఓటు వేయాలో, కౌంటింగ్ తదితర విషయాలను వివరించి, ఓటర్లకు అవగాహన కల్పించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



రాయలవారి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కాపు నేతలు

కాకినాడ రూరల్: ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయలు 553వ జయంతిని బుధవారం కాకినాడ శుభం కాపు కల్యాణమండపంలో నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల చిత్ర పటానికి కాపు సద్భావన సంఘ గౌరవ అధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడు సలాది వీర వెంకట సత్యనారాయణమూర్తి, మాదవరపు పట్టాభిరామయ్య, సేతు మాధవరావు, జల్ల రంగనాయకులు, బాజిబోయిన వెంకటేష్ నాయుడు, దామిశెట్టి శ్రీనివాస్, రెడ్నం రాజా తదితరులు నివాళులర్పించారు.

జ్యోతిబసుకు నివాళులు

కాకినాడ సిటీ: స్వాతంత్య్ర సమర యోధుడు, సీపీఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ జ్యోతిబసు 14వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బుధవారం కాకినాడ సుందరయ్య భవన్‌లో జ్యోతిబసు చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేఎస్ శ్రీనివాస్, నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజులు జోహార్లు అర్పించారు. విద్యార్థి దశలోనే అభ్యుదయ మార్గంలో పయనించి భారత కమ్యూనిస్టు ఉద్యమ తొలి తరం నేతగా, కార్మికోద్యమ నేతగా బసు కృషి చేశారని కొనియాడారు. 23 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి సేవలు అందించి చరిత్ర సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబుతో పాటు నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, విజయ, వసంత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు యువకుడి మృతి



మృతుడు సూరిబాబు

కరప: మండలం వేములవాడలో పాముకాటుకు గురైన ఒక యువకుడు మృతి చెందాడు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు వేములవాడ గ్రామానికి చెందిన వాసంశెట్టి సూరిబాబు (37) బుధవారం తెల్లవారుజామున 4.50 గంటలకు పశువుల పాకవద్దకు వెళ్లాడు. అక్కడ సూరిబాబు ఎడమకాలు పాదంపై భాగంలో విషసర్పం కాటు వేసింది. ఈవిషయం తెలుసుకున్న బాధితుడి సోదరుడు వాసంశెట్టి రాంబాబు బంధువులతో కలసి చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సూరిబాబు మృతిచెందాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు

షర్మిలారెడ్డికి సత్కారం

సామర్లకోట: నూతన హౌసింగ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మేడపాటి షర్మిలా రెడ్డిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు సత్కరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి షర్మిలారెడ్డిని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో ఆమె బుధవారం విజయవాడ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దాంతో ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు.

21న విశ్రాంత రైల్వే ఉద్యోగుల సమావేశం

సామర్లకోట: విశ్రాంత రైల్వే ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి ఈనెల 21వ తేదీన రైల్వే పెన్షనర్ల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్ల సంక్షేమ ఫెడరేషన్ కార్యదర్శి, విశ్రాంత రైల్వే మేనేజరు ఎల్ఎస్ రాజ్‌పుట్ బుధవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రైల్వే స్టేషన్ ఆవరణలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు.

స్వచ్ఛత సరిపోలేదట!

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కాకినాడకు దక్కని సముచిత స్థానం
- కార్పొరేషన్ యంత్రాంగంలో అసంతృప్తి
- ఉన్నతాధికారులకు నివేదించేందుకు నిర్ణయం



తడి పొడి చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

కాకినాడ: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో కాకినాడ వెనుకబడింది. ర్యాంకుల కోసం ప్రామాణికంగా తీసుకున్న అనేక అంశాల్లో కాకినాడ అత్యుత్తమస్థానంలో ఉన్నప్పటికీ ర్యాంకింగ్‌లో మాత్రం వెనక్కు నెట్టడంపై అధికారుల్లో సైతం అసంతృప్తి నెలకొంది. 2022–23 సంవత్సరానికి సంబంధించి తాజాగా ఎంపిక చేసిన ర్యాంకుల్లో కాకినాడకు సరైన చోటు దక్కలేదు. మూడు లక్షల పైబడి 10 లక్షలలోపు జనాభా కలిగిన 446 నగరాలు స్వచ్ఛసర్వేక్షణ్‌కు పోటీపడ్డాయి. ఇందులో కాకినాడ దేశవ్యాప్తంగా 178వ ర్యాంకును సాధించగా, రాష్ట్రస్థాయిలో 31 నగరాలతో పోటీపడి 10వ స్థానానికి పరిమితమైంది. వాస్తవానికి 2022 సెప్టెంబర్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు మూడు అంశాలను ప్రాతిపదికగా తీసుకుని స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకులను ఎంపిక చేశారు.

మూడు అంశాలను ప్రామాణికంగా తీసుకుని 9,500 మార్కులకు పోటీ పెట్టారు. ఇందులో సర్వీస్ లెవెల్ ప్రోగ్రెస్ (ఎస్ఎల్‌పీ), సిటిజన్ వాయిస్, సర్టిఫికేషన్ విభాగాలకు సంబంధించి మార్కులు కేటాయించారు. ఇందులో ఇంటింటికీ చెత్త సేకరణకు 98 శాతం, తడి–పొడిచెత్త సేకరణలో 96 శాతం, మార్కెట్లు, నివాస, వాణిజ్యప్రాంతాల పరిశుభ్రతలో 'కాకినాడ' నూరుశాతం సక్సెస్ సాధించినట్టు సర్వేలో వెల్లడైంది. మరోవైపు చెరువులు పరిశుభ్రత, నిర్వహణలో సైతం నూరుశాతం ఫలితాన్ని సాధించారు. చెత్తను ప్రాసెసింగ్ చేసే విధానంలో మాత్రం కార్పొరేషన్ కాస్త వెనుకబడింది. ఇక్కడ తడిచెత్త నుంచి సీఎన్‌జీ గ్యాస్‌ను ఉత్పత్తి చేసే బయోమెథనేషన్ ప్లాంట్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడం వల్ల కొంత వెనుకబడింది. అయితే ప్రధానంగా మలమూత్ర విసర్జనరహిత నగరంలో కాకినాడకు ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పుడు ఓడీఎఫ్ మాత్రమే ఇవ్వడం వల్లే ర్యాంకింగ్‌లో వెనుకబడ్డామని కార్పొరేషన్ యంత్రాంగం చెబుతోంది. ఇక్కడ 23 కమ్యూనిటీ టాయ్‌లెట్స్, 14 పబ్లిక్ టాయ్‌లెట్లు, సెప్టింక్‌ట్యాంక్ వ్యర్థాలకు సంబంధించి ప్రాసెసింగ్ చేసేందుకు 30 కేఎల్‌డీ సామర్థ్యం ఫీకల్‌స్లైడ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కూడా ఇక్కడ అందుబాటులో ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ఏడాది కాకినాడకు ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ ర్యాంక్ ఇచ్చారు. ఇవన్నీ అందుబాటులో ఉన్నప్పుడు కనీసం ఓడీఎఫ్ ప్లస్ అయినా ఇవ్వాల్సి ఉందని అయితే ఓడీఎఫ్ మాత్రమే ఇచ్చారంటున్నారు. దీనివల్ల ర్యాంకింగ్‌లో వెనుకబడాల్సి వచ్చిందని కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి.

యావరేజ్‌లోను అగ్రస్థానం

స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకింగ్‌కు సంబంధించి కేటాయించిన ర్యాంకింగ్‌లో కూడా కాకినాడ ఉత్తమ స్థానంలోనే నిలిచింది. ఎస్ఎల్‌పి విభాగంలో రాష్ట్రస్థాయిలో 1707, దేశస్థాయిలో 1819 సరాసరి మార్కులు రాగా కాకినాడకు 2554 వచ్చాయి. ఇక సిటిజన్ వాయిస్ విభాగంలో రాష్ట్రస్థాయి సరాసరి 1211, కేంద్రస్థాయిలో 1122 మార్కులు రాగా, కాకినాడకు 1684 మార్కులు వచ్చాయి. మొత్తంగా చూస్తే మూడు విభాగాల్లో కలిపి కాకినాడకు 9,500 మార్కులకు 4,830 మార్కులు వచ్చాయి. కేవలం ఓడీఎఫ్ విషయంలో ప్రామాణికాన్ని సక్రమంగా పరిగణనలోకి తీసుకోకపోవడం వల్లే ర్యాంక్‌లో వెనుకబడ్డామన్న అభిప్రాయం ఇక్కడి నగరపాలక సంస్థ యంత్రాంగంలో నెలకొంది. టాయ్‌లెట్లు, ఫీకల్ స్లైడ్స్, ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు కూడా అందుబాటులో ఉన్నప్పటికీ ఓడీఎఫ్ ర్యాంక్ మాత్రమే ఇవ్వడం వల్ల వెనుకబడ్డామన్న అంచనాతో కార్పొరేషన్ ఉంది.

పునః సమీక్షించాలని కోరతాం



'స్వచ్ఛ సర్వేక్షణ్'లో కాకినాడకు కేటాయించిన ర్యాంక్‌పై పునః సమీక్షించాల్సిందిగా కోరతాం. ప్రధానంగా సర్టిఫికేషన్ విభాగంలో గతంలో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ ఇచ్చారు. ఇప్పుడు కూడా అవే సేవలు కొనసాగుతున్నప్పటికీ ఓడీఎఫ్ మాత్రమే ఇవ్వడం వల్ల సుమారు 400 మార్కులు నష్టపోయాం. అవి కూడా జత చేసి ఉంటే కాకినాడ మెరుగైన స్థానంలో ఉండేది. ఈ వాస్తవాన్ని పరిశీలించాల్సిందిగా స్వచ్ఛసర్వేక్షణ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

– సీహెచ్ నాగనరసింహారావు, నగరపాలక సంస్థ, కమిషనర్

'బడ్జెట్' ప్రతిపాదనలను సిద్ధం చేయండి

- కమిషనర్ నాగ నరసింహారావు
- వివిధ విభాగాధిపతులతో సమీక్ష



వివిధ విభాగాధిపతులతో సమీక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: రానున్న 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అధికారులను ఆదేశించారు. బడ్జెట్ ప్రతిపాదనలపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం అన్ని విభాగాధిపతులతో సమీక్షించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలు, 2024–25 బడ్జెట్ అంచనాలపై అధికారులతో చర్చించారు. ఈ నెల 20వ తేదీ నాటికి ప్రతిపాదనలను పూర్తిచేసేలా ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణ మోహన్, ఏవో శిరీష్, ఈఈ మాధవి, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

బీచ్‌కు సందర్శకుల తాకిడి



కాకినాడ బీచ్‌లో సందర్శకుల సందడి

కాకినాడ రూరల్: సంక్రాంతి పండగకు వివిధ ప్రాంతాల నుంచి తమ సొంతూళ్లకు వచ్చిన వారు కాకినాడ బీచ్‌లో సరదాగా కాలక్షేపం కోసం తరలివస్తున్నారు. రెండు రోజులుగా బీచ్‌కు సందర్శకుల తాకిడి ఎక్కువ అయ్యింది. సూర్యారావుపేట వద్ద న్యూ, ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌కు చేరుకుని సముద్ర స్నానాలు చేస్తూ సరదాగా గడుపుతున్నారు. మంగళవారం వేలాదిగా తరలివచ్చిన సందర్శకులతో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. బుధవారం కూడా ఎక్కువగా సందర్శకులు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రూరల్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బీచ్‌లో స్నానాలకు దిగేవారు సముద్రం లోపలకు వెళ్లకుండా మెరైన్ పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేశారు.

హోరాహోరీగా సీఏకే టోర్నీ



కరప హైస్కూలులో రెండో సెమీఫైనల్స్‌లో తలపడుతున్న కరప, వేళంగి జట్లు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప (సీఏకే) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నీ తుదిదశకు చేరుకుంది. ఇందులో బుధవారం రెండు సెమీఫైనల్స్ జరిగాయి. మొదటి సెమీఫైనల్‌లో పెద్దాపురప్పాడు, గురజనాపల్లి జట్లపై జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన పెద్దాపురప్పాడు జట్టు 18.5 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన గురజనాపల్లి జట్టు 16.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసి విజేతగా నిలిచి, ఫైనల్స్‌కు చేరుకుంది. తర్వాత జరిగిన రెండో సెమీఫైనల్‌లో వేళంగి, కరప జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన వేళంగి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత చేజింగ్‌కు దిగిన కరప జట్టు 19.3 ఓవర్లలో ఏడువికెట్ల నష్టానికి 133 పరుగులు చేయడంతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. గురువారం గురజనాపల్లి, కరప జట్ల మధ్య ఫైనల్స్ జరుగుతాయని సీఏకే అధ్యక్షుడు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు దేవు మధు వీరేష్ తెలిపారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన



అభివృద్ధి ప్రణాళిక శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25 రూపకల్పనపై అందరూ అవగాహన కలిగించుకుని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని మండల ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, ఫ్రంట్‌లైన్ వర్కర్స్, గ్రామ పంచాయతీ ఫంక్షనల్ కమిటీ సభ్యులకు ఏర్పాటు చేసిన రెండురోజుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 17 రకాల సుస్థిరాభివృద్ధి సూచికలను సాధించేందుకు నిర్దేశించిన 9 థీమ్స్‌లో గ్రామ పంచాయతీకి అవసరమైన ఒక థీమ్‌ను ఎంపికచేసుకుని ఆయా అంశాలను పూర్తిచేసేందుకు సాధారణ నిధులు, 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి 25 శాతం కేటాయించి, మిగిలిన నిధులను ఇతర అంశాలకు వినియోగించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు శానిటేషన్, తాగునీటి కోసం కేటాయించి, ఆన్‌లైన్ విధానంలో ప్రణాళికను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు, ఏఓ గుత్తుల భీమశంకర రాబు, వి.సునీల్‌కుమార్ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఎలా రూపొందించాలో వివరించి వీడియో ద్వారా శిక్షణ ఇచ్చారు.

ముగిసిన కావమ్మ తిరునాళ్లు



కావమ్మ, మారెయ్యలను దర్శించుకున్న భక్తులు

సామర్లకోట: స్థానిక రజకపేటలో ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్న కావమ్మ ఆలయం వద్ద సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన తిరునాళ్లు బుధవారంతో ముగిసాయి. మండల పరిధిలోని అనేక గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయకూలీల కుటుంబాల వారు కావమ్మ, మారెయ్యలను దర్శించుకున్నారు. పాఠశాలలకు 18 వరకు సెలవులు ఉండడంతో తిరునాళ్లకు అధిక సంఖ్యలో పిల్లలు తరలి వచ్చారు. ఆలయం సమీపం నుంచి వెళ్తున్న పిఠాపురం బ్రాంచి కెనాల్‌లో ఎయిర్ బాల్ ఏర్పాటు చేసి పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేశారు. 22వ తేది సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు సుకపట్ల నాగేశ్వరరావు, ఆదినారాయణ తెలిపారు.

ఐదు తరాల ఆత్మీయ కలయిక



వడ్లమూరులో ఒక్కచోట కలిసిన కంటేవారి కుటుంబ సభ్యులు

పెద్దాపురం: ఔను ఐదు తరాల వారంతా ఒకచోటకు చేరారు. సంక్రాంతికి ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఒకచోటు సందడి చేశారు. మండలంలోని వడ్లమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు కుటుంబ సభ్యులంతా బుధవారం వడ్లమూరులో ఆత్మీయంగా కలుసుకున్నారు. సుమారు 350 మంది సభ్యులుగా ఉన్న తాతలు, మామలు, అవ్వలు, ఆడపడుచులు, మనుమళ్లు, మునిమునమళ్లు, అల్లుళ్లు, తోడల్లుళ్లు అందరూ ఒకచోట చేరారు. ఈ ఆత్మీక కలయిక పండగ వాతావరణాన్ని మరింత ఉత్సాహాన్నిచ్చింది. కుటుంబ సభ్యులంతా కలసి పెద్దలను సత్కరించుకున్నారు.

సా..గుతున్న రబీ

- పూర్తికాని దమ్ములు, నాట్లు
- మండలంలో 80 శాతం నాట్లు పూర్తి
- ఇలాగైతే చివరిలో ఇబ్బందులు తప్పదంటున్న అధికారులు



వరినాట్లు వేసేందుకు చదునుచేసి సిద్ధంచేస్తున్న పంటపొలం



కరపలో ముదరగా వెదజల్లిన పంటపొలం

కరప: మండల శివారు ప్రాంతాల్లో రబీ సీజన్ నేటికీ పూర్తికాలేదు. రైతులు ఇప్పటికీ దమ్ములుచేసి, వెదజల్లు కుంటున్నారు. డిశంబరు నెలాఖరుకు నాట్లు పూర్తి చేసుకోవాలని, మార్చి నెలాఖరుకు కాలువలు మూసివేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా సాగు పనులు కొనసాగుతున్నాయి. ఇలాగైతే సీజన్ చివరిలో సాగునీటికి ఇబ్బందులు తప్పవని అధికారులు అంటున్నారు. గడచిన ఖరీఫ్‌లో ముందస్తు సాగుచేపట్టాలని, దానివల్ల రబీ కూడా ముందుకు వచ్చి, మూడో పంటగా అపరాలు సాగుచేయడానికి అనుకూలంగా ఉంటుందని, వ్యవసాయశాఖాధికారులు రైతులకు సూచిస్తున్నారు. తొలకరి కోతలు నవంబరు నెలాఖరుకు పూర్తయినా, చివరిలో తుపాన్లు రావడంతో కొంత జాప్యం అనివార్యమైంది. డిసెంబరు 10న కాలువలకు నీరు వదులుతామని, వారం రోజుల్లో నారుమళ్లు వేసుకోవడం, వెదజల్లు పద్ధతిని అనుసరించాలని అధికారులు సూచిస్తున్నారు. క్లోజర్ పనులు ఆలస్యం కావడం వల్ల నీటి రాక సైతం పది రోజులు ఆలస్యమైంది. మండలంలో 14,300 ఎకరాల్లో వరిసాగు చేస్తారు. ఈ మండలంలోని భూములన్నీ కాలువ శివారు, మెరక భూములు ఎక్కువగా ఉంటాయి. మిగిలిన ప్రాంతాల కంటే సాధారణంగా మండల పరిధిలో వరినాట్లు ఆలస్యంగా జరుగుతుంటాయి. అధికారులు ముందస్తు సాగుచేపట్టాలని చెప్పారేకానీ, నీటి విడుదల ఆలస్యం చేశారని, అందుకే రబీనాట్లు ఆలస్యమవుతున్నాయని రైతులు అంటున్నారు. సాగు నీటికి ఇబ్బంది లేకపోయినా శివారు, మెరక ప్రాంత భూముల్లో దాళ్వా సాగు ఆలస్యమైందని యండమూరు, జి.భావారం, వేళంగి, వేములవాడ, పెదకొత్తూరు, వాకాడ, వలసపాకల, కరప, గొడ్డటిపాలెం, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం తదితర గ్రామాల రైతులు తెలిపారు. వశివారు భూములు కావడంతో ఇప్పుడే దమ్ములుచేసి, వెదజల్లుకుంటున్నట్టు ఆయా గ్రామాల్లోని రైతులు అంటున్నారు. ఆలస్యమైన ప్రాంతాల్లో స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1153, 1156 రకాలను సాగుచేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

మండలంలో 80 శాతం పూర్తి



మండలంలో రబీ నాట్లు ఇప్పటివరకు 80 శాతం పూర్తయింది. వారం రోజుల్లో రబీనాట్లు పూర్తవుతాయి. ఆలస్యమైన ప్రాంతాల్లో స్వల్పకాలిక రకాలు సాగుచేసుకోవాలి. వెదజల్లడం వల్ల సమయం కూడా కలిసి వస్తుంది. వెదజల్లులో కలుపు నివారణకు యాజమాన్యపద్ధతులు పాటిస్తే అధికదిగుబడులు సాధించవచ్చు.

– ఏవీ రాజేష్, కరప మండల వ్యవసాయాధికారి



వలసపాకలలో ఆలస్యంగా వెదజల్లిన పొలం

నెలగంట ముగ్గులకు వీడ్కోలు



సామర్లకోటలో రథం ముగ్గులతో ధనుర్మాసానికి వీడ్కోలు

సామర్లకోట: సంక్రాంతిని పురస్కరించుకుని నెల గంటతో నెల రోజుల పాటు సాగిన ఇంటింట ముగ్గులకు ముక్కనుమ రోజున వీడ్కోలు పలికారు. బుధవారం తెల్లవారు జామున మహిళలు వారి వారి ఇళ్ల ముందు రథం ముగ్గులను వేసి, ఆ రథాన్ని తాళ్లతో లాగుతున్నట్లుగా ముగ్గువేసి తాడును సమీపంలో ఉన్న భోగి మంటలకు కలిపారు.

వైభవంగా త్రిమూర్తుల స్వామి తీర్థం



త్రిమూర్తుల స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

తుని రూరల్: చేపూరులో 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న త్రిమూర్తుల స్వామి ఆలయం వద్ద బుధవారం తీర్థం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు త్రిమూర్తుల స్వామిని దర్శించి, పూజలు చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో ప్రమాదాలు నివారణకు హైవే అధికారులు, రూరల్ పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. గ్రామస్తులతో పాటు రాజుపేట, మర్లపాడు, వెలమ కొత్తూరు, కొత్త వెలంపేట, ఎర్రకోనేరు, జగన్నాథగిరి, గెడ్లబీడు, తుని తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి, తీర్థంలో పాల్గొన్నారు.

నేడు : తుని మండలం జగన్నాథగిరి శివారు మెట్టపై గురువారం బాలయోగి తీర్థం నిర్వహించనున్నారు. ముక్కనుమ మరుసటి రోజు ఇక్కడ తీర్థం నిర్వహించనుండగా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

భిన్నత్వంలో ఏకత్వం

- 20 నుంచి మూడు రోజులు గంధోత్సవాలు
- మత సామరస్యానికి ప్రతీకగా ఉరుస్

పెద్దాపురం: సుమారు 354 సంవత్సరాల చరిత్ర కలిగిన పట్టణ శివారులోని హాజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా (తొమ్మిది మూరల సాయిబు) మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉరుస్ ఈ నెల 20వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించేందుకు దర్గా కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా 20వ తేదీన దర్గా వద్దకు మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు విచ్చేసి బాబా ఆశీస్సులు పొందుతారు. ముస్లిం పెద్దలు, అంజుమన్ వ్యవస్థాపకుడు దివంగత ఎంఏ సత్తార్ ఇంటి వద్ద నుంచి 20వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు గంధం ఊరేగింపు మేళతాళాలతో బయలుదేరి దర్గా వద్దకు చేరుకుంటుంది. సాయంత్రం ఏడు గంటలకు హైదరాబాద్ వారిచే తయారు చేయబడిన పచ్చటి వస్త్రాన్ని బాబా దర్గాకు అలంకరించి ఖురాన్ పఠనంతో గంధాన్ని బాబా సమాధికి పూస్తారు. ఆ గంధాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో స్వీకరిస్తారు.

దాతల సహకారంతో..

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉర్సును ఏటా ప్రజా సహకారంతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. దర్గాకు సంబంధించి ఎటువంటి ఆస్తులు లేకపోవడంతో దాతలు పై కప్పు ఏర్పాటు, దర్గా వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి సహకారాలందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు తదితరులు ప్రారంభిస్తారు. 22వ తేదీ వరకు గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మూడో రోజు భారీ విందు ఏర్పాటు చేస్తారు. దర్గా సభ్యులు ఎండీ లాయక్ ఆలీ, బాబూలాల్, ఆషిక్ ఆలీ, రఫీ, షబ్బీర్, జలీల్, బాజి, రిజ్వాన్, ఇర్షాద్ ఆలీ, హాఫీజ్, జాకిర్‌ల ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు మూడు రోజుల పాటు భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా అన్ని మతాల వారితో కలిపి వివిధ సేవా కార్యక్రమాలు, పేదలకు వస్త్రదానం నిర్వహించి ఉరుస్‌ను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 20వ తేదీ రాత్రి 9 గంటలకు రాజమహేంద్రవరం వారిచే మిమిక్రీ ట్రాక్, మ్యూజికల్ ప్రోగ్రామ్‌తో పాటు ఖవ్వాలీని ఘనంగా నిర్వంచేందుకు ఏర్పాట్లు చేశారు.



ఉరుస్ గంధోత్సవానికి సిద్ధమవుతున్న తొమ్మిది మూరల సాయిబు సమాధి